సాక్షి
కర్నూలు
ఆదివారం । 28 । జూలై । 2024



రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రథమనంది దేవాలయ ఆవరణలో రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీల్లో 16 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.



నల్లమల టైగర్'

తెలుగు రాష్ట్రాల్లోని నల్లమల అడవులు పులి సంరక్షణకు ఆశ్రయ దుర్గంగా మారాయి. పులి ప్రవర్ధనానికి ఈ ప్రాంతం అత్యంత అనుకూల పర్యావరణాన్ని కలిగి ఉంది. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.68
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:100.523
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,03,676
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,17,571

న్యూస్‌రీల్

పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల ఫిర్యాదుకు ప్రత్యేక సెల్

కర్నూలు(అర్బన్): జిల్లాలో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై ఫిర్యాదుకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు డీపీఓ టి.నాగరాజునాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించి కార్యాలయంలో రెండు షిఫ్టులుగా ఉద్యోగులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక షిఫ్ట్ పనిచేస్తుందని, మరో షిఫ్ట్ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తుందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలు తమ గ్రామానికి సంబంధించిన పారిశుద్ధ్య సమస్య, తాగునీటి ఇబ్బందులపై 08518–277278 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పకడ్బందీగా డిపార్టుమెంటల్ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): ఏపీపీఎస్సీ డిపార్టుమెంటల్ పరీక్షలను జూలై 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్, డీఆర్వో కె.మధుసూదన్‌రావు ఆదేశించారు. పరీక్షల సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం తన చాంబర్‌లో నిర్వహించారు. కర్నూలు నగరంలోని సనత్ నగర్‌లో ని ఆయాన్ డిజిటల్ ఆన్‌లైన్ కేంద్రంలో ఉదయం, మధ్నాహ్నం షిఫ్టుల వారీగా పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నేడు కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ బిల్లులు ఈ నెల 28వ తేదీ ఆదివారం కూడా చెల్లించవచ్చని విద్యుత్ రెవెన్యూ కార్యాలయం జేఏవో రామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లుల కౌంటర్లన్నీ ఈ నెల 31వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు తెరచి ఉంటాయని పేర్కొన్నారు. గడువులోపు బిల్లులు చెల్లించకపోతే ఇళ్లకు రూ.25, వ్యాపార సంస్థలకు రూ.125 సర్‌చార్జీ(జరిమానా) వచ్చే బిల్లులో కలుపుతారని తెలిపారు.

సుంకేశ్వరి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.చిరంజీవిని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో పారిశుద్ధ్య లోపం వల్ల డయేరియా వ్యాప్తి చెంది పదుల సంఖ్యలో ప్రజలు ఆసుపత్రుల పాలయ్యారన్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి జ్యోతి మృతి చెందిందన్నారు. ఈ ఘటనలకు సంబంధించి ఈ నెల 16న సంబంధిత కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. ఆయన ఇచ్చిన సంజాయిషీపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సస్పెండ్ చేశారన్నారు. ఎక్కడైనా కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీపీఓ హెచ్చరించారు.

> 'జూదం స్థావరాల సమాచారం సేకరించి దాడులు చేయండి. ప్రత్యేక నిఘా ఉంచి నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కటకటాలకు పంపండి. ఎంతటి వారైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించవద్దు.'
>
> – ప్రతిరోజూ టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ బిందు మాధవ్

జూదానికి లారీ కొమ్ము కాస్తోంది!



కర్నూలులోని వెంకటరమణ కాలనీలో పేకాట నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్న ప్రాంతం

పోలీసుల అండతో పేకాట

- చక్రం తిప్పుతున్న టీడీపీ మహిళా నాయకురాలి అనుచరుడు
- లాడ్జీలు, శివారు ప్రాంతాల్లో యథేచ్ఛగా నిర్వహణ
- రూ.50వేలు డిపాజిట్ చేస్తేనే అనుమతి
- నెలనెలా మామూళ్లతో కొందరు ఖాకీల మౌనం
- దాడుల సమాచారం ముందుస్తుగా చేరవేత



కర్నూలు: చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాల్సిన పోలీసు శాఖ చేష్టలుడిగి చూస్తోంది. అడపాదడపా దాడులు జరిపినప్పటికీ సూత్రదారులు, నిర్వాహకుల జోలికి వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎస్పీ బిందు మాధవ్ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా ప్రతిరోజూ పోలీసు అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్న క్షేత్రస్థాయిలో పాటిస్తున్న దాఖలాలు లేవు. ఇందుకు కర్నూలు నగరానికి చెందిన ఓ వ్యక్తి, పోలీసులకు సుపరిచితుడైన టీడీపీ నేత నిర్వహిస్తున్న పేకాట శిబిరాలే నిదర్శనం. తోటలు, పంట పొలాలు, స్థిరాస్తి వెంచర్లు, ఫామ్ హౌస్‌లలో స్థావరాలు ఏర్పాటు చేసి జూదం నిర్వహిస్తున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి. ఆడే వారికి మినహా ఇతరులకు సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడటంలో ఇతనికి ఇతనే సాటి. బృందంలోని సభ్యులంతా ఒకరికొకరు సమాచారం అందించుకొని, నిర్దేశించుకున్న స్థలానికి, అనుకున్న సమయానికి చేరుకోవడం వరకే వారి చేతుల్లో ఉంటుంది. అక్కడి నుంచి నిర్వాహకుడు చెప్పినట్లు నడుచుకోవాల్సిందే. శిబిరం ఎక్కడ ఏర్పాటు చేశాడో చెప్పడం ద్వారా అందరూ అక్కడికి చేరుకోవాలి. జూదరులు లక్షల్లో పందేలు కాస్తూ పొద్దుపోయే వరకు ఆ అడ్డాలోనే పేక ముక్కలకు పని చెబుతున్నారు. అవసరమైతే అక్కడికే మద్యం, భోజనం కూడా ఏర్పాటు చేయడం ఈ నిర్వాహకుడి ప్రత్యేకత.

రూ.50వేల డిపాజిట్‌తో అనుమతి

పేకాట శిబిరాల నిర్వహణలో ఆర్గనైజ్డ్ గ్యాంబ్లర్‌గా పేరు పొందిన అతను ఇప్పుడు పోలీసు అధికారులను కూడా లెక్క చేయని పరిస్థితికి ఎదిగాడనే చర్చ జరుగుతోంది. గతంలో ఓ ఉన్నతాధికారికి నెలకు రూ.5 లక్షలు మామూళ్లు ఇచ్చి పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకి తెలిసి తమ పరిధిలో పేకాట శిబిరాలు నిర్వహిస్తూ ఉన్నతాధికారి వద్దకు ఎలా వెళ్తావంటూ మందలించడంతో ఆయనపైనే ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసిన సంఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం అతను గార్గేయపురం, లక్ష్మీపురం, తడకనపల్లె, వీకర్ సెక్షన్ కాలనీ, జగన్నాథగట్టు శివారులోని స్థిరాస్తి వెంచర్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్లల్లో పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఖరీదైన వాహనాల్లో తరలివెళ్తున్న జూదరులు దర్జాగా ఆయా కేంద్రాల్లో పేకాట ఆడుతున్నారు. రూ.50వేలు డిపాజిట్ చేసిన వారిని మాత్రమే శిబిరాల్లోకి అనుమతిస్తున్నట్లు సమాచారం.

దాడుల సమాచారం ముందస్తుగానే..

పేకాట స్థావరాలు, నిర్వాహకులకు సంబంధించిన సమగ్ర సమాచారం పోలీసుల వద్ద ఉంది. అయినప్పటికీ పేకాటకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడకపోవడం చూస్తే వీరి పనితీరు ఇట్టే అర్థమవుతుంది. పోలీసులు, నిర్వాహకుల మధ్య లావాదేవీల కారణంగానే నామమాత్రపు కేసులతో సరిపెడుతున్నట్లు తెలుస్తోంది. బదిలీపై వేరే చోటుకు వెళ్లిన కొందరు అధికారులు, సిబ్బంది కూడా ఇప్పటికీ నిర్వాహకులతో సంబంధాలు కొనసాగిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. వేరేచోటుకు వెళ్లినప్పటికీ స్థానిక సిబ్బంది సాయంతో ఎప్పటికప్పుడు నిర్వాహకులకు సమాచారం చేరవేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. దాడుల్లో పట్టుబడిన నగదు, వాహనాలను తప్పించి నిందితుల నుంచి పోలీసులు ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నట్లు సమాచారం.

పోలీసులకు ముడుపులు

కర్నూలు బుధవారపేటలోని 'డెన్'లో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి తెలంగాణ, ఏపీకి చెందిన పలువురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. పేకాట స్థావరం వైపు కన్నెత్తి చూడకుండా ఉండేందుకు స్థానిక పోలీసులకు భారీ మొత్తంలో ముట్టజెప్పినట్లు విచారణలో తేలడంతో అప్పట్లో అధికారులు నివ్వెరపోయారు. నిర్వాహకుడు టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో మళ్లీ ఇప్పుడు ఆ డెన్‌లో పేకాట నిర్వహణకు రంగం సిద్ధమైంది.

ఎవరీ 'కొమ్ము'

ఈ రెండు అక్షరాలు జూదరులతో పాటు పోలీసులకు సుపరిచితమే. కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కర్నూలుకు వలస వచ్చిన ఓ వ్యక్తి నగర శివారు కోడుమూరు రోడ్డులోని ఓ కాలనీలో నివాసముంటున్నాడు. టీడీపీ మహిళా విభాగం నాయకురాలు అండతో జూద కేంద్రాల నిర్వహణ, ఉపాధి అవకాశంగా మలుచుకొని ఆర్థికంగా స్థిరపడ్డాడు. గత ప్రభుత్వం పేకాట శిబిరాలపై ఉక్కుపాదం మోపడంతో ఈ వ్యక్తి కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కర్నూలు శివారు ప్రాంతాల్లో మళ్లీ పేకాట స్థావరాలు ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేసి రెండు చేతులా సంపాదిస్తున్నాడనే చర్చ జరుగుతోంది.

సమావేశాల ముసుగులో జూదం

- కర్నూలు నగరంలోని హోటళ్లు, లాడ్జీలలో గదులు అద్దెకు తీసుకుని జూదం నిర్వహిస్తున్నారు.
- వెంకటరమణ కాలనీలోని ఓ టూరిజం కేంద్రం, దాని పక్కనున్న కళ్యాణ మండపంలో కూడా పేకాట జోరుగా సాగుతున్నట్లు ఆ కాలనీ ప్రజల్లో చర్చ జరుగుతోంది.
- కొత్తబస్టాండ్ సమీపంలోని మూడు లాడ్జీలు, పార్కు రోడ్డులోని మరో లాడ్జి పేకాట రాయుళ్లకు స్థావరాలుగా మారాయి. గదులు అద్దెకు తీసుకుని జూదం ఆడుతున్నారు.
- వాస్తవానికి లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం చట్ట రీత్యా నేరం. కానీ గిరాకీలు లేవనో, గదులు ఖాళీగా ఉన్నాయనే కారణంతో ఆయా లాడ్జిల నిర్వాహకులు జూదరులకు సహకరిస్తున్నారు.
- సమావేశాల పేరుతో అనుమతి తీసుకుని జూదంలో మునిగితేలుతున్నారు.
- జూదం ఆడుతూ పట్టుబడుతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నా, కేసులు నమోదవుతున్నా అలవాటు పడ్డవారు ఏమాత్రం భయపడని పరిస్థితి.
- తనిఖీ చేసే పోలీసు సిబ్బందిని మచ్చిక చేసుకుంటూ బయటపడుతున్నారు.
- అనుకోకుండా పోలీసులకు పట్టుబడినప్పటికీ న్యాయ స్థానంలో జరిమానా కట్టి సులువుగా బయటకు రావచ్చనే ధీమా జూదరుల్లో కనిపిస్తోంది.

రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు

- ఎస్పీ బిందు మాధవ్



మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు (టౌన్): ముఖ్యమైన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, నేర నివారణకు ఇవి ఎంతో దోహదపడతాయని ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ట్రాఫిక్, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, నేషనల్ హైవే అథారిటీ, మున్సిపల్, పోలీసు శాఖల అధికారులతో శనివారం ఎస్పీ సమీక్ష నిర్వహించారు. కర్నూలు నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని, ఇందుకు అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మలుపుల వద్ద బారికేడ్లు, సంకేత సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. ఇతరులకు ఇబ్బంది లేకుండా కర్నూలు నగరంలో ఆటోలు ఫ్రీ లెఫ్ట్‌గా వెళ్లేందుకు ఒక రూట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటోస్టాండ్‌కు స్థలం కేటాయించేందుకు పరిశీలించాలని ఆదేశించారు. గూడ్స్ రైళ్లలో వచ్చే బియ్యాన్ని గోడౌన్లకు తరలించే లారీలు రాత్రివేళ మాత్రమే తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో సర్కిళ్ల మధ్యలో నిర్మాణాలు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో నేషనల్ హైవే అథారిటీ మహబూబ్ నగర్, కడప, అనంతపురం డివిజనల్ అధికారులు, నగరపాలక డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్యారాణి, డీఈఈ గిరిరాజు, ఏఈ ప్రవీణ్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ గౌతమి, డీటీఆర్‌బీ సీఐ ఆదినారాయణరెడ్డి, ట్రాన్స్‌కో అధికారులు, సీఐ పార్థసారధిరెడ్డి, ఎస్ఈ ఉమాపతి పాల్గొన్నారు.

శ్రీశైలం వైపు వే'గంగా'

- పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర నది
- టీబీ డ్యాం నుంచి 1.17 లక్షల క్యూసెక్కులు నీటి విడుదల
- నదితీర గ్రామాల్లో హెచ్చరికలు జారీ చేసిన రెవెన్యూ అధికారులు



ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

కర్నూలు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది



సుంకేసుల నుంచి విడుదలవుతున్న నీరు

కర్నూలు సిటీ: ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలతో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీశైలం వైపు వరద జలాలు పరుగులు తీస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌లోని తుంగభద్ర జలాశయానికి లక్ష క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అన్ని గేట్లు ఎత్తివేసి 1.17 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఆ నీరు జిల్లాకు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. తీర గ్రామాల్లో ప్రజలు నదివైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నదిలో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కోట్ల విజయభాస్కర్ రెడ్డి బ్యారేజీ(సుంకేసుల బ్యారేజీ) నుంచి 26 గేట్లు రెండు మీటర్లు పైకెత్తి నీటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శనివారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేశారు. తొలుత ఐదు వేల క్యూసెక్కులను విడుదల చేయగా.. మధ్యాహ్నానికి 10 వేలు, రాత్రి 15 వేల క్యూసెక్కులకు పెంచారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేస్తున్న నీటిని ముందుగా తాగునీటి అవసరాల కోసం వినియోగించనున్నారు. వెలుగోడులో 16.95, గోరుకల్లులో 12.5 టీఎంసీల నీటిని నింపిన తరువాతే ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు. ఈ రెండు రిజర్వాయర్లు పూర్తి స్థాయిలో నింపేందుకు ప్రస్తుతం పోతిరెడ్డిపాడుకు వస్తున్న నీటితో నెల రోజులు పట్టే అవకాశం ఉంది. అయితే పోతిరెడ్డిపాడు నుంచి 44 వేల క్యూసెక్కులు విడుదల చేస్తేనే తక్కువ రోజుల్లోనే రిజర్వాయర్లను నింపవచ్చని ఇంజినీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

శ్రీశైలంలో 129 టీఎంసీల నీరు

కృష్ణ, తుంగభద్ర నదుల్లో నీటి ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి బ్యారేజీ(సుంకేసుల బ్యారేజీ) నుంచి 1,01,100 క్యూసెక్కులు, ప్రియదర్శిని జూరాల నుంచి 2,56,068 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ నీటితో ప్రస్తుతం రిజర్వాయర్ నీటి మట్టం 867 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 129 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఏపీ, తెలంగాణ జెన్‌కోలు పోటీపడి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 62,262 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నాయి.

చంద్రన్న బీమాకు గ్రహణం

- ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు
- సహజ మరణాలకు రూ.5 లక్షలు
- అమలు కాని చంద్రబాబు హామీ
- జిల్లాలో 463 కుటుంబాల ఎదురు చూపులు



కర్నూలు(అగ్రికల్చర్): సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ధీమానిచ్చే చంద్రన్న బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడరాదనే ఉద్దేశంతో గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వైఎస్‌ఆర్ బీమా అమలు చేసింది. రూపాయి ఖర్చు లేకుండా బీమా పరిహారం అందించి పేద కుటుంబాలకు భరోసా ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే వైఎస్‌ఆర్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా పేరు మార్చడం తప్ప కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణిస్తే భరోసానివ్వడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి నెలన్నర రోజులవుతున్నా.. ఒక్క కుటుంబానికి కూడా బీమా పరిహారం అందలేదు. గతంలో 2014 నుంచి 2019 మధ్య టీడీపీ పాలనలో కూడా చంద్రన్న బీమా పథకాన్ని నామమాత్రంగా అమలు చేశారు. వందలాది మంది మృతిచెందినప్పటికీ కొందరికే బీమా ఇచ్చారు.

హామీ నెరవేరేదెన్నడు?

ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు తాము అధికారంలోకి రాగానే ప్రమాదవశాత్తు జరిగే మరణాలకు రూ.10 లక్షలు, సహజ మరణాలకు రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలన్నర రోజులవుతున్నా హామీ అమలుపై దృష్టి సారించలేదు. ప్రభుత్వ తీరును గమనిస్తే.. బీమాతో ధీమా కల్పించేందుకు సీఎం చంద్రబాబు సుముఖంగా లేరనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఉత్తర్వులు ఏవీ?

జిల్లాలో 6,38,828 రైస్‌కార్డులు ఉండగా.. 5,38,678 కుటుంబాలు చంద్రన్న బీమా కింద నమోదై ఉన్నాయి. మార్చి 18 నుంచి ఎన్నికల కోడ్ రావడంతో అప్పటి నుంచి బీమా కింద రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడం ఆగిపోయింది. జూన్ 12న నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ నెల 8 నుంచి చంద్రన్న బీమా సైట్‌ను ఓపెన్ చేసి రిజిస్ట్రేషన్‌లు, డాక్యుమెంట్ల అప్‌లోడ్‌కు అవకాశం లభించింది. అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలుపై ఇంతవరకు విధివిధానాలు రాలేదు. ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు, సహజ మరణాలకు రూ.5 లక్షలు పెంచుతూ ఉత్తర్వులు కూడా ఇవ్వలేదు.

బీమా ఎప్పుడో?

ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ప్రమాదవశాత్తు మరణించినట్లు 85 మంది రిజిష్టర్ అయ్యారు. ప్రమాద మరణాలకు సంబంధించిన చాలా వరకు డాక్యుమెంట్లు అప్‌లోడ్ అయ్యాయి. సహజ మరణాలకు సంబంధించి 373 మంది రిజిష్టర్ అయ్యారు. డాక్యుమెంటేషన్ కూడా జరుగుతోంది. మొత్తంగా 463 కుటుంబాలు చంద్రన్న బీమా కోసం ఎదురు చూస్తున్నాయి. బీమా పొందిన వారు ఏ విధంగా మరణించినా 24 గంటల్లో మట్టి ఖర్చు కోసం రూ.10 వేలు చెల్లిస్తారు. కుటుంబ యజమాని మరణించినా మట్టి ఖర్చులు కూడా దక్కడం లేదు. చంద్రన్న బీమాకు పట్టిన గ్రహణం ఎప్పుడు వీడుతుందా అని బాధిత కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు.

గతంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్‌ఆర్ బీమా కింద నమోదు అయిన కుటుంబాలకు రెండు రకాలుగా బీమా వర్తింప చేసింది. కుటుంబానికి ఆధారమైన 18–50 ఏళ్లలోపు పాలసీదారులు సాధారణంగా మరణిస్తే వైఎస్‌ఆర్ బీమా కింద రూ.లక్ష పరిహారం అందించింది. ఈ పరిహారాన్ని బీమా కంపెనీలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా చెల్లించింది. 18–70 ఏళ్ల లోపు పాలసీదారులు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షలు పరిహారం అందించింది. మార్చిలో ఎన్నికల కోడ్ వచ్చే నాటికి డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసిన క్లెయిమ్‌లన్నింటినీ సెటిల్ చేసింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత క్లెయిమ్‌లు రిజిస్టర్ చేయడం, డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడం నిలిచిపోయింది. ఆ తరువాత వచ్చిన వాటన్నింటినీ కూటమి ప్రభుత్వమే పరిష్కరించాల్సి ఉంది. ప్రభుత్వం ఏర్పడి 45 రోజులవుతున్నా... ఒక్క క్లైయిమ్ కూడా సెటిల్ కాలేదు. పైపెచ్చు చంద్రన్న బీమా మార్గదర్శకాలే రాలేదు.

ఈ ఏడాది 'పది' విద్యార్థులకు సీబీఎస్ఈ పరీక్షలు

- డీఈఓ శామ్యూల్



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ శామ్యూల్

ఓర్వకల్లు: ఈ ఏడాది తొలిసారిగా పదోతరగతి విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్షలకు హాజరవుతున్న తరుణంలో పాఠ్యాంశాలను అర్థమయ్యే రీతిలో బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె. శామ్యూల్ ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాశాఖాధికారి ఓంకార్ యాదవ్, పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీజీ విద్యార్థులతో స్కానింగ్ పరీక్షలు

- కనిపించని రేడియాలజిస్టులు
- కొత్త ఈసీజీ మిషన్ కొన్నా వాడని సిబ్బంది
- పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీలో వెలుగులోకి



అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పెద్ద డాక్టర్లు కాకుండా వైద్య విద్యను అభ్యసించే పీజీ వైద్య విద్యార్థులే స్కానింగ్ చేస్తున్నారు. రోగులకు ఉపయోగపడుతుందని కొత్తగా ఈసీజీ మిషన్ కొన్నా దానిని వాడకుండా సిబ్బంది పక్కన పెట్టారు. ఈ విషయాలను శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు ఈసీజీ టెక్నీషియన్లకు ఆయన మెమోలు జారీ చేశారు. డయాగ్నొస్టిక్ బ్లాక్‌లోని అల్ట్రా సౌండ్ మిషన్ దగ్గర తనిఖీ చేసిన సందర్భంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గర్భిణులు స్కానింగ్ కోసం బయట వేచివుండటం, 8 స్కానింగ్ మిషన్లలో పీజీ వైద్య విద్యార్థులు స్కానింగ్ చేయడం ఆయన గమనించారు. స్కానింగ్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమక్షంలో చేయాలని హెచ్‌ఓడీకి చెప్పినా పరిస్థితిలో మార్పు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు ఇబ్బందులు కలుగజేస్తూ నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చర్మ వ్యాధుల విభాగం దగ్గర రోగులు కూర్చునే అరుగు విరిగిపోయి ఉండటంతో దానిని మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఎంఆర్‌ఐ స్కాన్, ఏపీ కౌంటర్ల ముందు టైల్స్ విరిగిపోయి ఉండటంతో సరిచేయాలని చెప్పారు. సర్జికల్ బ్లాక్‌లోని 1, 2వ అంతస్తులో నాలుగు బాత్‌రూమ్‌లలో తలుపులు, కమోడ్‌లు విరిగిపోయి అపరిశుభ్రంగా ఉండటం గమనించారు. వెంటనే ఈ పరిస్థితిని చక్కదిద్దాలని సిబ్బందిని ఆదేశించారు. డయాగ్నొస్టిక్ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లలో ఉన్న బాత్‌రూమ్‌లో స్టీల్ ట్యాప్‌లు దొంగతనాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. ఇకపై ట్యాప్‌లు చోరీకి గురైతే వాటి సొమ్ము సెక్యూరిటీ సిబ్బంది నుంచి వసూలు చేస్తామని హెచ్చరించారు. విభిన్న ప్రతిభావంతుల కౌంటర్‌కు వెళ్లేందుకు ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, వైద్యసిబ్బంది ఉన్నారు.

నల్లమల టై'గర్'

అందంలోనూ.. బలంలోనూ పెద్ద పులికి సాటిరాగల మరో జంతువు భూమిపై కనిపించదు. అది నడుస్తుంటే రాజసం తొణికిసలాడుతుంది. భూమిపై అంతరించి పోతున్న జాతుల జాబితాలో చేరి రెడ్ డాటా బుక్‌లో నమోదు అయిన అపురూపమైన పులి నల్లమల ప్రాంతంలో మీసం మెలేస్తోంది. తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ పర్యావరణానికి రక్షణగా నిలుస్తోంది. అటవీ అధికారులు తీసుకుంటున్న చర్యలతో నల్లమల 'పులి'కిస్తోంది. రేపు (సోమవారం) అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



- పులుల ఆవాసంగా నల్లమల
- ఎన్ఎస్‌టీఆర్‌లో పులి సంరక్షణకు ప్రత్యేక సాయుధ బలగం
- ఆహార జంతువుల పెంపునకు కృషి
- రేపు అంతర్జాతీయ పెద్దపులుల దినోత్సవం



ఆత్మకూరురూరల్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న నల్లమల అడవులు పులి సంరక్షణకు ఆశ్రయ దుర్గంగా మారాయి. పులి ప్రవర్ధనానికి ఈ ప్రాంతం అత్యంత అనుకూల పర్యావరణాన్ని కలిగి ఉంది. 2022 లెక్కల ప్రకారంలో వందకు పైగా పులులు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జునసాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వ్)కు విస్తరణ పులుల అభయారణ్యంగా ఉంటున్న గుండ్ల బ్రహ్మేశ్వరం వన్యప్రాణి అభయారణ్యంలో కూడా పులులు క్రమేపి విస్తరిస్తూ వైఎస్సార్ జిల్లా వరకు చేరుకుంటున్నాయి. ముఖ్యంగా నల్లమలలోని ఆత్మకూరు, మార్కాపురం, నాగార్జున సాగర్ అటవీ డివిజన్‌లు, తెలంగాణాలోని అచ్చంపేట అటవీ డివిజన్‌లలో విస్తరించిన నాగార్జున సాగర్ - శ్రీశైలం పులుల అభయారణ్యంలో సిబ్బంది పర్యవేక్షణ, మానవ వనరులను అత్యంత ప్రతిభావంతంగా వినియోగించు కోవడం వంటి అంశాల కారణంగా ఇక్కడ పులులు క్రమేపి పెరుగుతున్నాయి. 2014లో ఈ అంశాలపై ఎన్‌టీసీఏ అత్యున్నత ప్రతిభా అవార్డును అప్పటి ఎన్ఎస్‌టీఆర్ ఎఫ్‌డీ రాహుల్ పాండే అందుకున్నారు. ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో 2014-15లో పులుల గణన చేపట్టగా 37 అని తేలింది. పదేళ్లలో ఆ సంఖ్య క్రమేపీ పెరుగుతూ ప్రస్తుతం 100కు పైగా చేరినట్లు సమాచారం. విస్తీర్ణం రీత్యా రెండు తెలుగు రాష్ట్రాలలో విస్తరించి ఉన్న నాగార్జున సాగర్ శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యం దేశంలోనే 54 అభయారణ్యాల్లో అతి పెద్దది.

పులి ఆహార జంతువుల నిష్పత్తి పెంచేందుకు యత్నాలు..

నల్లమల పరిధిలోని అడవుల్లో పులికి ఆహార జంతువులైన జింకలు, దుప్పులు, కణుతులు, కొండగొర్రె, మనుబోతు, అడవి పంది వంటి జంతువులు పుష్కలంగానే ఉన్నాయి. అయినప్పటికీ పులి ఆహార జంతువుల సంఖ్యను పెంచేందుకు అటవీ అధికారులు శ్రద్ధ తీసుకుంటున్నారు. కాకినాడ సమీపంలోని నాగార్జున ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ కర్మాగారం గ్రీన్ కవర్ ఆవరణలోని అటవీ ప్రాంతంలో పెంచ బడుతునన్న వన్యప్రాణులను నల్లమలకు తరలించారు. సుమారు 300 దుప్పులు, 30 వరకు కణుతులను నల్లమలలోని పచ్చర్ల, మార్కాపురం డివిజన్‌లోని పెద్దమంతనాలలో ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో ఉంచారు. ఇవి దట్టమైన అటవీ వాతావరణానికి అలవాటు పడగానే అడవుల్లోకి స్వేచ్ఛగా తిరిగేందుకు వదలనున్నారు. వీటిని వన్యప్రాణి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. సున్నిపెంటలో కూడా ఎన్‌క్లోజర్‌లలో ఉన్న వివిధ వన్యప్రాణులను కూడా అడవుల్లో వదలనున్నారు.

సంరక్షణకు ఎస్‌టీఎఫ్ బలగాలు

నాగార్జునసాగర్ – శ్రీశైలం (ఎన్ఎస్‌టీఆర్) పులుల అభయారణ్యంలో పులుల సంరక్షణ కోసం ప్రత్యేక సాయుధ బలగాల నియామకం జరగబోతోంది. స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్)గా పిలువబడే ఈ బలగాలలో 15 మంది ప్రత్యేక శిక్షణ పొందిన కమెండోలు ఉంటారు. జాతీయ పులుల సంరక్షణ సాధికార సంస్థ (ఎన్‌టీసీఏ) మార్గదర్శకాల ప్రకారం ప్రతి పులుల అభయారణ్యంలోను పులి వేటగాళ్ల నియంత్రణకు సాయుధ బలగం తప్పని సరి. దేశంలోనే విస్తీర్ణంలో అత్యంత పెద్దదైన ఎన్ఎస్‌టీఆర్‌లో ఇంతవరకు సాయుధ సంరక్షణ బలగాలు లేవు. అయితే ఈ లోపాన్ని గ్రహించిన ఎఫ్‌డీపీటీ బీఎల్ఎన్ మూర్తి కేంద్ర ప్రభుత్వానికి ఈ మేరకు ప్రతిపాదనలు పంపారు. మిలటరీ, పారా మిలటరీ ఫోర్స్‌ల నుంచి ఉద్యోగ విరమణ చేసిన సైనికుల నుంచి అటవీ శాఖ తమ అంచనాల మేరకు అర్హత కలిగిన వారిని అటవీ శాఖ రిక్రూట్ చేసుకునే అవకాశాలున్నాయి. ఈ సాయుధ బృందానికి వాహన సౌకర్యంతో పాటు వేటగాళ్ల పని పట్టేందుకు అవసరమైన అన్ని రకాల సాంకేతిక, సమాచార సామగ్రిని అందుబాటులో ఉంచనున్నారు. ఈ క్రమంలోనే ఏనుగులతో అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో పులుల పెరుగుదల ఇలా..

సంవత్సరం	పులుల సంఖ్య
2014-15	37
2015-16	40
2016-17	46
2017-18	46
2018-19	47
2019-20	63
2020-21	70

(2022లో జరిగిన జాతీయ పెద్దపులుల గణన అంచనా ప్రకారం ఎన్ఎస్‌టీఆర్, గుండ్లబ్రహ్మేశ్వరంలో మొత్తం 100 తక్కువ కాకుండా పెద్ద పులులు ఉన్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. అధికారికంగా ఇంకా వెల్లడి కాలేదు).

తల్లికి దూరమైన పులి పిల్లల వన ప్రవేశానికి సర్వం సిద్ధం..

దాదాపు ఏడాది క్రితం ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని పెద్ద గుమ్మడాపురం పరిధిలో తల్లికి దూరమై గ్రామంలోకి వచ్చిన పులి పిల్లలను అటవీ అధికారులు సంరక్షించి తిరుపతి జూకు తరలించారు. వాటిని ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లలో ఉంచి పెంచుతున్న సంగతి తెలిసిందే. అక్కడే వాటికి ఆహార జంతువులను వేటాడడంలో తర్ఫీదును కూడా మొదలు పెట్టారు. ఈ పులి పిల్లలు అటవీ వాతావరణానికి అలవాటు పడేందుకు మార్కాపురం డివిజన్‌లో ఒక ప్రత్యేక ప్రాంతాన్ని గుర్తించి అక్కడ అన్ని ఏర్పాట్లు చేసి ఉంచారు. త్వరలో వాటిని ఈ అటవీ ఎన్ క్లోజర్‌కు తరలించనున్నారు. అక్కడ అంచెలంచలుగా ఈ కూనలు పూర్తి స్థాయిలో అడవిలోకి వెళ్లి స్వతంత్రంగా జీవించ గలిగేలా చేయనున్నారు.

పులులు పెరుగుతున్నాయి



నల్లమలలో పెద్ద పులుల సంఖ్య క్రమేపి పెరుగుతోంది. కొన్ని భద్రతా చర్యల్లో భాగంగా వాటి సంఖ్యను తరుచు ప్రకటించి ప్రచారం చేయడం మంచిది కాదు. వెయ్యి పులులను అకామిడేట్ చేయగల నల్లమలలో పులి ఆహార జంతువులను ఆ నిష్పత్తిలో పెంచాల్సి ఉంది. దేశంలోనే విస్తీర్ణంలోఅతి పెద్దదైన నాగార్జున సాగర్ -శ్రీశైలం పులుల అభయారణ్యం పులుల సంఖ్యలో కూడా దేశంలోనే పెద్దది కావాలన్న ఆకాంక్షలను విజయవంతం చేసేందుకు అటవీ సమీప గ్రామాల ప్రజల,మేధావుల, పాత్రికేయుల సహకారం ఆశిస్తున్నాము. – సాయిబాబా, డీడీ పీటీ, ఆత్మకూరు డివిజన్

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మల్లికార్జునరెడ్డి

సాక్షి ఎఫెక్ట్



దరఖాస్తులపై సంతకాలు చేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి

నంద్యాల(అర్బన్): నంద్యాల మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మల్లికార్జునరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ డీటీగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు తహసీల్దార్‌గా జిల్లా రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల విధుల్లో వచ్చిన తహసీల్దార్ చంద్రశేఖర్ ఆరు రోజుల క్రితం బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో ఎవరికీ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వకపోవడంతో ఎంసెట్, ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్‌కు వెళ్లే విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలపై సంతకాల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ఈ సమస్యపై 'సంతకం చేసేవారేరీ?' అంటూ శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. జిల్లాలోని అన్ని మండల కార్యాలయాలకు డీటీలుగా విధులు నిర్వహిస్తున్న వారికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో దరఖాస్తుల్లో కదలిక వచ్చింది. నంద్యాల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరెడ్డి దరఖాస్తులపై సంతకాలు చేయడంలో బిజీగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆళ్లగడ్డ: స్థానిక ఆల్ఫా ఇంజినీరింగ్ కళాశాల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. చాగలమర్రి మండలం మద్దూరు గ్రామానికి చెందిన యోహాన్ (45) అనే వ్యక్తి బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పెద్దాసుపత్రిలో ట్రాన్స్‌జెండర్లకు హెల్ప్ డెస్క్



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ట్రాన్స్‌జెండర్ల (లింగమార్పిడి చేయించుకున్నవారు) కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య సమస్యలపై వీహెచ్ఎస్ సీడీసీ ప్రాజెక్టు ఆస్పైర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి కూడా ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉంటాయన్నారు. ఎయిడ్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ భాస్కర్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, ట్రాన్స్‌జెండర్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ముంబైలో రైలు ఢీకొని కోవెలకుంట్ల యువకుడి మృత్యువాత



రజనీకాంత్ (ఫైల్)

కోవెలకుంట్ల: రెండు రోజుల క్రితం ముంబైలో జరిగిన రైలు ప్రమాదంలో కోవెలకుంట్లకు చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. పట్టణంలోని గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న రామసుబ్బయ్య, భ్రమరాంబ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రజనీకాంత్(24) ముంబైలో ఎంటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. తోటి స్నేహితులు కోవెలకుంట్లలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని శనివారం ఇంటికి తీసుకొచ్చారు. మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, తదితరులు యువకుడి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పాముకాటుతో రైతు మృతి



శ్రీనివాసులు (ఫైల్)

మహానంది: పొలంలో వరినారు తీస్తుండగా పాముకాటుకు గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాసులు(50) పొలానికి వెళ్లి నారు తీస్తుండగా పాము కాటేసింది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ముందుగా బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు శ్రీనివాసులును నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని చెప్పారు.